
సంక్షేమ సంతకం



పేదల జీవితాల్లో వెలుగులు పంచేందుకు.. వారి మోములో చిరునవ్వులు చూసేందుకు, ఆర్థిక పరిస్థితిని, జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి. ప్రజా సంకల్పయాత్రలో రాష్ట్ర ప్రజల కష్టాలను నేరుగా చూసిన ఆయన వాటి పరిష్కారం కోసం ఎంతో తపించి, నవరత్న పథకాలకు రూపకల్పన చేశారు. వాటిని మించి మరిన్ని పథకాలను అమలు చేస్తూ సంక్షేమ సారథిగా ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

- పేదల జీవితాల్లో సంక్షేమ పథకాల వెలుగులు
- చెప్పిన వాటితో పాటు చెప్పనివీ అధికం
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు



నడుపూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి చెక్ అందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే నాగిరెడ్డి (ఫైల్)

గాజువాక : నియోజకవర్గంలో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 27 సంక్షేమ పథకాలను అమలు చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్న పథకాలతో పాటు అదనంగా 18 పథకాలను లబ్ధిదారులకు అందించారు. ఒకపక్క కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను కొనసాగిస్తూనే మరో పక్క సంక్షేమ సంతకం చేశారు. గాజువాక హౌస్ కమిటీ భూములకు క్రమబద్ధీకరణకు పట్టాలు పొందిన వారికి సర్వ హక్కులు సంక్రమించే విధంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు మంజూరు, ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, ప్రధాన గెడ్డలకు రక్షణ గోడలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, రక్షణ గోడల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, పేదలకు సొంతిళ్లు, చెరువుల అభివృద్ధి, ప్రధాన రహదారుల విస్తరణ, అభివృద్ధితో పాటు ముందెన్నడూ లేని విధంగా, భవిష్యత్‌లో ఎవరి తరం కాదన్న రీతిలో సంక్షేమ ఫలాలను అందించారు.

సంక్షేమ పథకాల లబ్ధిదారులు

క్రమసంఖ్య	పథకం	లబ్ధిదారులు
01.	రైతు భరోసా	2,777
02.	సున్నా వడ్డీ పంట రుణాలు	94
03.	వైఎస్సార్ ఉచిత పంటల బీమా	39
04.	వైఎస్సార్ కాపు నేస్తం	1,697
05.	వైఎస్సార్ ఈబీసీ నేస్తం	2,050
06.	వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	15,206
07.	వైఎస్సార్ సంపూర్ణ పోషణ	3,908
08.	వైఎస్సార్ పెన్షన్ కానుక	31,534
09.	వైఎస్సార్ చేయూత	15,063
10.	జగనన్న తోడు వడ్డీ	4,110
11.	జగనన్న తోడు	4,629
12.	వైఎస్సార్ సున్నా వడ్డీ	51,336
13.	బ్యాంక్ లింకేజ్	51,336
14.	వైఎస్సార్ ఆసరా	53,311
15.	వైఎస్సార్ బీమా	284
16.	స్త్రీ నిధి	434
17.	జగనన్న చేదోడు	2,702
18.	జగనన్న గోరుముద్ద	5,754
19.	జగనన్న అమ్మ ఒడి	37,771
20.	జగనన్న విద్యా కానుక	10,589
21.	వైఎస్సార్ మత్స్యకార భరోసా	817
22.	పాస్టర్లకు గౌరవ వేతనం	37
23.	ఇమామ్‌లు, మోజమ్‌లకు గౌరవ వేతనం	110
24.	పేదలందరికీ ఇళ్లు	2,70,001
25.	జగనన్న విద్యా దీవెన	10,589
26.	జగనన్న వసతి దీవెన	10,635
27.	వైఎస్సార్ వాహన మిత్ర	3,646



76వ వార్డులో కె.సీతమ్మకు పెన్షన్ ఇస్తున్న వలంటీర్ వరలక్ష్మి (ఫైల్)

ఐదేళ్లుగా వాహన మిత్ర



నేను సొంతంగా ఆటో కొనుక్కుని నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ఆటోపై వచ్చే ఆదాయంపైనే మా కుటుంబం బతకాలి. మా బాధలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాకు వాహన మిత్ర పథకం అమలు చేసి ప్రతి ఏడాది రూ.10వేలు ఇస్తున్నారు. దీని కోసం ఎవరిచుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా మా బ్యాంక్ అకౌంట్‌లోనే పడుతోంది. ఇది మాకు చాలా సంతోషంగా ఉంది.

– ఆళ్ల జగదీష్, గాజువాక

గౌరవ వేతనం అందుతోంది



పాస్టర్లు, ఇమామ్‌లు, మోజమ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ వేతనం ఇవ్వడం హర్షణీయం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం చారిత్రాత్మకం. నాకు ఏడాదిగా గౌరవ వేతనం అందుతోంది. ఈ వేతనంతో ఎంతోమంది పాస్టర్లు, ఇతర లబ్ధిదారులు ధైర్యంగా జీవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– వాద్రా శ్రీను (జోయెల్), పాస్టర్, 88వ వార్డు

పెన్షన్ రూ.3వేలకు పెంచారు



నాకు ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పెన్షనే ఆధారం. ఐదేళ్ల క్రితం పెన్షన్ రూ.2వేలు వచ్చేది. దీన్ని రూ.3వేలు చేస్తానని సీఎం జగన్ చెప్పారు. చెప్పినట్టుగానే క్రమంగా పెంచుతూ ఇప్పుడు రూ.3వేలు ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. సచివాలయం ఉద్యోగులు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి కొచ్చి పెన్షన్ ఇస్తున్నారు. రావడానికి ముందురోజు ఫోన్ కూడా చేస్తున్నారు.

– కొప్పిశెట్టి శేషు, గాజువాక

కబడ్డీ పోటీల విజేత 'పెద ముషిడివాడ'

- మహిళల విభాగంలో తానాం–1 జట్టు విజయం
- ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు



నువ్వా – నేనా అన్నట్లు తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు



హోరాహోరీగా ఆడుతున్న మహిళా కబడ్డీ జట్లు



విజేత పెదముషిడివాడ జట్టుతో నిర్వాహకులు

అగనంపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శనివారం కబడ్డీ పోటీలతో ముగిశాయి. పురుషులు, మహిళల విభాగాల్లో పరవాడ మండలంలోని గ్రామ సచివాలయ జట్ల మధ్య నిర్వహించిన కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు పోటా పోటీగా తలపడ్డారు. పురుషుల విభాగంలో గొర్లెవానిపాలెం జట్లపై పెదముషిడివాడ, మహిళల విభాగంలో గొర్లెవానిపాలెం జట్లపై తానాం–1 జట్టు విజయం సాధించి నియోజకవర్గ పోటీలకు ఎంపిక అయ్యాయి. కార్యక్రమంలో పాల్గొన్న పరవాడ మండలాభివృద్ధి అధికారి కార్యాల పరిపాలనాధికారి రాంబాబు, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, ఆడుదాం ఆంధ్రా పరవాడ మండల కో–ఆర్డినేటర్ లోవరాజు, గ్రౌండ్ ఇన్‌చార్జి ప్రసన్న కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.అన్నాజీ రావు, తులసీ సత్యవతి, ఎస్.వి.రమణ, లక్ష్మీ రాణి, శ్రీదేవి, దేవి, అమ్మాజీ, నాయుడుబాబు, వివిధ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఎన్‌జేసీఎస్ సమావేశం

- యాజమాన్యం వైఖరిపై కార్మిక సంఘాల ఆగ్రహం
- 29, 30 తేదీల్లో సమ్మెకు సిద్ధం

ఉక్కునగరం: ఉక్కు కార్మికుల సమస్యలపై శనివారం న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌జేసీఎస్ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. కార్మిక నాయకుల సమాచారం మేరకు.. సమావేశంలో సెయిల్ కార్మికుల వేతన సవరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను పరిష్కరించాలని కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనిపై తామేమీ ఇవ్వలేమని, సమస్యలపై సబ్ కమిటీ వేసి నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. కార్మికులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేయగా దానికీ యాజమాన్యం తిరస్కరించింది. సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన నూతన వేతనాలు, సెయిల్‌లో విలీనంపై పట్టించుకోకపోవడం గమనార్హం. యాజమాన్యం వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మిక సంఘాలు ఈ నెల 29, 30 తేదీల్లో సమ్మెకు వెళ్తామని తెలిపారు. బీఎంఎస్‌ను కూడా సమ్మెలో పాల్గోవాలని కోరగా బీఎంఎస్ నాయకులు తిరస్కరించారు. సమావేశంలో జాతీయ కార్మిక సంఘాల నాయకులతో పాటు స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రజల ఆస్తి

- పరిశ్రమను కాపాడుకోవడం అందరి బాధ్యత
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 1073వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. దానిని కాపాడుకునేందుకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ఆర్చి వద్ద కార్మికులు నిరసనలు మొదలుపెట్టి శనివారం నాటికి 1073వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చినట్లైతే విశాఖ ఉక్కుకు సానుకూల స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు

క్లుప్తంగా

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



నడుపూరు పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: నవోదయ ప్రవేశ పరీక్ష మండల పరిధిలో శనివారం ప్రశాంతంగా ముగిసింది. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్ష కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పాఠశాలలో మొత్తం 192 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 142 మంది హాజరయ్యారు. మిగిలిన 50 మంది గైర్హాజరయ్యారు. ప్రవేశ పరీక్ష సందర్భంగా పాఠశాల ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా న్యూపోర్టు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సత్యసాయి సమితి వితరణ



అప్పలరాజు కుటుంబానికి సామగ్రి అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: జీవీఎంసీ నమ్మిదొడ్డిలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో దినసరి కూలి నమ్మి అప్పలరాజు ఇళ్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో అన్ని వస్తువులు పూర్తిగా దెబ్బ తిన్నాయని తెలుసుకున్న ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి, వారి కుటుంబానికి కావాల్సిన సాయాన్ని అందజేశారు. వారికి వంట పాత్రలు, వస్త్రాలు, ఆహార పదార్థాలు, బాధిత కుటుంబానికి ఒక నెలకు సరిపడా కిరాణా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, సత్యసాయి సేవా సమితి భక్తులు, పదాధికారులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌లకు స్థలాల కోసం వినతి



జీవీఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

గాజువాక : ప్రతి ఆర్టీసీ స్టాపేనకు వంద మీటర్ల దూరంలో ఆటోలను నిలుపుకోవడానికి అధికారికంగా స్థలాలు కేటాయించేందుకు సహాయపడాలని గాజువాక ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో వారు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆటో యూనియన్ నాయకులు గొలగాని నాయుడు, అప్పలరాజు తదితరులున్నారు.

వాంబే కాలనీలో పారిశుధ్య పనులు



దగ్గరుండి చెత్త తొలగింపజేస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. బ్లాకుల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మినీ జేసీబీల సాయంతో తొలగించారు. జీవీఎంసీ శానిటరీ అధికారులతో కలసి వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాంబే కాలనీలో ప్రత్యేక నిధులతో పారిశుధ్య పనులు చేపట్టామని చెప్పారు. వాడుక నీటిని పైపులైన్ల ద్వారా బయటకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో బీటీ రోడ్లకు భూమి పూజ



ఆటోనగర్‌లో రాజధాని కాటా వద్ద భూమి పూజ చేస్తున్న ఐలా కమిషనర్ జయచంద్ర

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో కొత్త బీటీ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. రాజధాని కాటా వద్ద ఐలా కమిషనర్ జయచంద్ర, ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ కొబ్బరికాయలు కొట్టి, పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.1 కోటి 4 లక్షల 40 వేలతో శ్రీనగర్ ఆర్చి నుంచి సెయిల్ యార్డు జంక్షన్ వరకు, రాజధాని కాటా నుంచి ఐలా కార్యాలయం వరకు నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐలా సంయుక్త కార్యదర్శి రామకృష్ణ రాజు, డి–బ్లాక్ మెంబర్ సీహెచ్.రమాకాంత్, ప్రాజెక్ట్ ఇంజినీర్ అవినాష్, ఐలా సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల బాలాజీకి పుష్పార్చన



పూజలు అందుకున్న తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. బాలాజీకి విశేష పుష్పాలతో సహస్ర నామార్చన చేశారు. దివ్యక్షేత్రం ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సేద్యానికి సాంకేతిక సాయం

- అధికారులకు జేసీ విశ్వనాథన్ ఆదేశం

మహారాణిపేట: ఆధునిక సాంకేతిక సహకారంతో రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సూచించారు. తన చాంబర్‌లో శనివారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి, ధాన్యం కొనుగోలు సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా జేసీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 10 ప్రొక్యూర్ సెంటర్లలో ఆరు వేల టన్నులకు గానూ 4,280 టన్నులు ప్రొక్యూర్ చేసినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి రెండో వారంలోగా లక్ష్యాలను సాధించాలన్నారు. ఫిబ్రవరి 15లోగా రబీలో వేసిన పంటను మొత్తం ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి పంట రుణాలు రెన్యువల్ చేయాలని ఆదేశించారు. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్‌రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, మండల, గ్రామ స్థాయిలో చర్చించిన విషయాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. పశు సంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, అసిస్టెంట్ ఎల్.డి.ఎం.రమణబాబు, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మధరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో అత్యాధునిక కంటి వైద్యం

గాజువాక : బీసీ రోడ్‌లోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ద్వారా పారిశ్రామిక ప్రాంత ప్రజలకు తమ సేవలను మరింత చేరువ చేయనున్నట్టు ఆస్పత్రి జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ తెలిపారు. దీని కోసం ఆస్పత్రిలో కొత్తగా రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకల సౌకర్యం, అత్యాధునిక రోగ నిర్ధారణ సౌకర్యం, ల్యాబ్, ఆప్టికల్, ఫార్మసీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ (పీఆర్) కె.బంగారు రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఉమా రామలింగేశ్వర స్వామి తీర్థం



తుంగ్లాంలో ఉమా రామలింగేశ్వరుని దర్శించుకుంటున్న గ్రామస్తులు



తీర్థ మహోత్సవంలో భక్తుల సందడి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాంలో కొలువైయున్న ఉమా రామలింగేశ్వరుని తీర్థ మహోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. ఆలయ పరిసరాలు సాయంత్రం విద్యుద్దీపాలతో మెరిశాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ఆలయం వద్ద గరిడీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, గ్రామ నాయకులు విరోతి రాము, సాలాపు వెంకటరావు, కృష్ణంరాజు, కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

బాలరాముడి వర్ణ చిత్రాల పోటీకి ఆహ్వానం

మహారాణిపేట: అయోధ్యలో ప్రారంభానికి ముస్తాబైన రామాలయం గురించే దేశం మొత్తం మాట్లాడుకుంటున్న శుభ తరుణంలో ప్రత్యేకించి చిన్నారులను ఈ సంబరాలలో భాగస్వాములు చేయాలని వేద విజ్ఞాన సమితి నిర్ణయించింది. వారి కోసమే బాలరాముడి వర్ణచిత్రాల పోటీ నిర్వహించి, మొదటి ముగ్గురు విజేతలకు రూ. 1,116 బహుమతిగా అందించడంతో పాటు పాల్గొన్న వారందరికీ శ్రీరాముని ఆశీసులతో కూడిన ప్రశంసాపత్రాలనూ అందించనుంది. ప్రముఖ చిత్రకారులు నుదురుపాటి అప్పల నరసయ్య (సయ్య మాస్టర్) పోటీల వివరాలను వెల్లడించారు. 6 నుంచి 15 ఏళ్ల మధ్య గల పిల్లలు ఎవరైనా, ఏ ప్రాంతం నుంచైనా వారి ఇంట్లోనే ఉండి ఈ పోటీలో పాల్గొనవచ్చని అప్పలనరసయ్య తెలిపారు. బాల రాముడు ప్రధాన అంశంగా వేసిన ఒక వర్ణ చిత్రాన్ని, పేరు, ఊరు, చదువుతున్న తరగతి రాసి ఫొటో తీసి ఈనెల 21వ తేదీలోపు సెల్ నంబర్ 81256 74182కు వాట్సప్ ద్వారా పంపాలని ఆయన కోరారు. గీసిన చిత్రంతోపాటే, ప్రశంసా పత్రంపై ముద్రించేందుకు క్లోజ్–అప్ ఫొటోను కూడాపై పంపాలని కోరారు. పోటీ విజేతలను ఈ నెల 22న సాయంత్రం ఏడు గంటలకు ప్రకటిస్తారు. ప్రశంసా పత్రాలు వాట్సప్ ద్వారా పంపిస్తామని సయ్య మాస్టర్ పేర్కొన్నారు.

క్వార్టర్ ఫైనల్స్‌లో జీవీఎంసీ జట్టు విజయం



విజయోత్సాహంలో జీవీఎంసీ క్రికెట్ జట్టు

గాజువాక : జీవీఎంసీ, హెచ్‌పీసీఎల్ జట్ల మధ్య జింక్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన వీడీసీఏ ఇన్‌స్టిట్యూషన్స్ మొదటి క్వార్టర్ ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు ఐదు పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదటగా బ్యాటింగ్‌ను ప్రారంభించిన జీవీఎంసీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టపోయి 131 పరుగులను చేసింది. జీవీఎంసీ తరపున సునంద 43, నరేష్ కుమార్ 26 పరుగులు చేశారు. హెచ్‌పీసీఎల్ తరుపున మోహన్ కుమార్ 4, వివేక్‌సింగ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన హెచ్‌పీసీఎల్ జట్టు 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 126 పరుగులు మాత్రమే చేయగలిగింది. జీవీఎంసీ తరఫున సుబ్రహ్మణ్యం 3, కెప్టెన్ శివ 2 వికెట్లను సాధించి తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన సునంద, సుబ్రహ్మణ్యంలను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

23న 'వైఎస్సార్ ఆసరా'



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న ఆర్పీ

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ ఆసరా పథకం నగదు ఈ నెల 23వ తేదీన విడుదల అవుతుందని సీవో ఎల్.వి.లక్ష్మి తెలిపారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల వారీగా వాటి వివరాలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. సభ్యులకు ప్రతీ కుటుంబంలో ఎన్ని పథకాలు అందుతున్నాయో తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకెవరికైనా పథకాలు అందకపోతే తెలియజేయాలన్నారు. ఎస్ఎల్ఎఫ్–1,2,3 ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఎల్ఎఫ్ కనకమహాలక్ష్మి, ఆర్పీలు గొంతిన సత్యవతి, కోరాడ లక్ష్మి, ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.